ఎంఎల్‌సిలకు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం నాయకులు

మా సర్వీస్ రూల్స్‌ను రూపొందించండి ..!

ఎంఎల్‌సిలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రభుత్వంలో విలీనమై రెండు సంవత్సరాలా రెండు నెలలు గడిచినా ఇంతవరకు తమ సర్వీస్ నిబంధనలు రూపొందించలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం తరపున ఎంఎల్‌సిలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతారెడ్డిలను కలసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ జలగం రామాంజులు బృందం, తిరుపతి, ఎస్వీ యూనివర్సిటీ, సెనేట్ హాల్ లో ఒక కార్యక్రమానికి వచ్చిన, వారితో మాట్లాడుతూ సర్వీస్ నిబంధనలు సకాలంలో రూపొందించుకపోవడం వల్ల,ప్రమోషన్స్ లో తమకు నష్టం జరుగుతోందని వాపోయారు. ఇరవైనుండి ముప్పై ఏళ్ల అనుభవం ఉన్నా ఎంతో నష్టపోతున్నామని వారి దృష్టి కి తీసుకెళ్లారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సమస్యలపై తమకు అవగాహన ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఎల్‌సిలను కలిసిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర, మహిళా కార్యదర్శి సావిత్రీబాయి, కోశాధికారి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు డాక్టర్ సుప్రజా రాణి, సంజీవరావు, భరణి కుమార్, సోమనాథ్, ప్రతాప్ గాంధీలు ఉన్నారు.

సైబర్ క్రైమ్ బాధితునికి సకాలంలో న్యాయం

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుపతి జిల్లా, చంద్రగిరి పోలీస్ సబ్ డివిజన్, తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుచానూరు లో నివాసం వున్న హిమగిరి బాబు అనే అతనికి ఒక అనుమానిత వ్యక్తి నుండి ఈ నెల 4వ తేదీ ఫోన్ కాల్ వచ్చింది. ఆ సస్పెక్ట్ నెంబర్ నుంచి బాధితునికి వాట్సప్ ఏపిపి ద్వారా ఒక లింకును కూడా సెండ్ చేశారు. హిమగిరి బాబు అది తెలియకుండా సస్పెక్ట్ లింకును ఓపెన్ చేసి తన మొబైల్ నెంబర్ మీద ఓటిపి ని వెరిఫికేషన్ చేశాడన్నారు. ఆ తరువాత బాధితుని బజాజ్ ఫైనాన్స్ క్రెడిట్ కార్డులో వరుసగా రూ.80,136, రూ.40,068, రూ.69,900, రూ.80,136, రూ.25,058 రూపాయల లావాదేవీలు (మొత్తం రూ.2,70,000లు) జరిగినట్లు గుర్తించా మన్నారు. తనకు తెలియకుండా తన క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయమవడంతో బాధితునికి ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో తిరుపతి పోలీసు పెరేడ్ మైదానంలో ఉన్న జిల్లా సైబర్ క్రైమ్ ఆఫీస్ కు వచ్చి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ సైబర్ కేసులో బాధితునిక అతను సకాలంలో స్పందించి సైబర్ క్రైమ్ ఆఫీసుకు రావడం వల్లే తాము సంబంధిత నోడల్ ఆఫీసర్స్ తో సంప్రదించి

మోసపోయిన మొత్తం నగదును రిఫండ్ చేసి, బాధితుడికి సకాలంలో న్యాయం చేశామ న్నారు. ఈ కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సీఐ రామ చంద్రా రెడ్డి, సైబర్ క్రైమ్ సిబ్బందిని ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి అభినం దించి, రివార్డు లను ప్రకటించారన్నారు. తిరుప తి జిల్లా ప్రజలు ఎవర యినా సైబర్ క్రైమ్ బారిన పడితే అధైర్య పడకుండా వెంటనే పోలీస్ పెరేడ్ మైదానంలో ఉన్న సైబర్ క్రైమ్ ఆఫీస్ కు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ క్రైమ్ కు గురైన వారు గోల్డెన్ అవర్ 24 గంటల లోపు సైబర్ క్రైమ్ ఆఫీస్ కు వెళితే న్యాయం జరిగే అవకాశం మెండుగా ఉంటుదని, మీరు అందుబాటులో లేకుంటే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్ క్రైమ్.జివోవి.ఇన్‌కు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా తిరుపతి ఎస్పి పేర్కొన్నారు.

అప్రమత్తత అవసరం: ఎస్ఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: టపాసులు పేల్చే సమయంలో చిన్న పిల్లలను, మహిళలను దూరంగా ఉంచాలని అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకట నరసింహం మండల ప్రజలకు, యువకులకు సూచించారు. పండగ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, అనుమతులు ఉంటేనే టపాసులు అమ్మాలని, అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకటనరసింహం ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ దీపావళి ముందు రోజు, దీపావళి రోజు గానీ టపాసులు పేల్చే సమయంలో చిన్న పిల్లల పై నిఘా పెట్టాలని మహిళలు కూడా ప్రయోగాలు చేయకుండా పెద్ద పెద్ద టపాసులు కాల్చే ప్రయత్నం చేయకుండా వాటికి దూరంగా ఉండాలని, పండగ రోజు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో సంతోషంలో జరుపుకోవాలని సూచించారు. పండుగ వేళలో అసాంఘిక కార్య కలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పండగ పూట వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని హెచ్చరించారు. టపాసులు అమ్మే వారు కచ్చితంగా అనుమతులు ఉండాలని దుకాణాల వద్ద నిబంధనల ప్రకారం తగు జాగ్రత్తలు తీసుకోవాలని తమ పర్యవేక్షణ వుంటుందన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో వుంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరిస్తూ పండగను ఆనందంగా జరుపుకోవాలన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు స్ఫూర్తిదాయకం: కమిషనర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు పలువురికి స్ఫూర్తి దాయకమని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యం లో వికలాంగులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఎన్నో ఏళ్లపాటు వికలాంగుల కోసంసేవా కార్యక్రమాలు చేపట్టడం అభినంద నీయమన్నారు. సాయం పొందుతున్న ప్రత్యేక ప్రతిభావంతులు తాము స్వశక్తితో ఎదిగేం దుకు బాటలు వేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మునీర్ బాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, రాజేశ్వరరావు, హరి నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

ఒకే మాట.. ఒకే బాణం రాముని తత్వం

- టిటిడి డీఈవో డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి



అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - క్యాంపస్ : 'ఒకే మాట ఒకే బాణం రాముని తత్వమని తిరుమల తిరుపతి దేవస్థానం డీఈవో ఎం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యం లో అంతర్జాతీయ అంతర్జాల సదస్సు సింగపూర్ తెలుగు సమాజం, సింగపూర్, శ్రీదశరథ రామా ఫౌండేషన్, చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ' శ్రీ రామాయణం శరణాగతి శాస్త్రం' అనే అంశంపై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిటిడి విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఒకే మాట ఒకే బాణం రాముని తత్వం అన్నారు. కుటుంబ విలువలు తెలిపింది రామాయణం అన్నారు. ధర్మ ప్రచారానికి టిటిడి ముందుంటుందని, అంతర్జా తీయంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షురాలు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మహదేవమ్మ మాట్లాడుతూ రామాయణం చదవటం వల్ల మనకు సంస్కృతి, సంప్రదాయాలు అలవాటవుతాయన్నారు. కష్టాలను ఓర్చుకునే ఓర్పు, నేర్పు సీతారాముల వల్ల మనం గ్రహిస్తామన్నారు. వెబినార్ సంచాలకులు తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి కృష్ణవేణి మాట్లాడుతూ భగవంతుడు మానవ రూపంలో శ్రీరామునిగా జన్మించి మానవులు ఎలా బతకాలో చూపించారన్నారు. ఆదికావ్యం రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందించిన వైరాగ్యాన్ని అందరూ గ్రహించాలన్నారు. ఇండోనేషియా నుండి ఉపన్యాసం అందించిన శ్రీరామాయణ హరినాధ రెడ్డి మాట్లాడుతూ రామాయణ కావ్యం శరణాగతి శాస్త్రం అన్నారు. వాల్మీకి, దశరధుడు, సీత, లక్ష్మణుడు భరతుడు, గుహుడు వంటి పాత్రలు శ్రీరామునికి శరణాగతి పొందడం వల్ల మోక్షాన్ని పొందారన్నారు. శరణాగతి పొందటం వల్ల అహం నశిస్తుందని, భక్తి మార్గాన్ని ఆచరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షు లు బొమ్మిరెడ్డి, ఉపాధ్యక్షులు జ్యోతిశ్వర్ రెడ్డి, ఆస్ట్రేలియా భార్గవి, న్యూజిలాండ్ కవిత, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుప్రజ, సత్యనారాయణమూర్తి వంటి వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో ఖాది ఫెస్ట్ ప్రారంభం

ఖాదీ ఉత్పత్తులను ఆదరించండి: సీఈఓ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): దేశ వ్యాప్తంగా ఖాదీ ఉత్ప త్తులను పెంచా లని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఖాదీ విలేజర్స్ బోర్డును ఏర్పాటు చేసిందని, ఖాదీ వారోత్స వా లను ఆయా రాష్ట్ర ప్రభుత్వా లు నిర్వహిం చాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవా రం తిరుపతిలోని ఎస్ఆర్

మాట్లాడుతున్న ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో విఆర్ విజయ రాఘవ నాయక్

కన్వెన్షన్ హాల్ (పాత వెంకటేశ్వర థియేటర్) లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరాథ్ చేతులు మీదుగా ఖాదీ ఫెస్ట్– 2023ను ప్రారంభించనున్నారని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో విఆర్ విజయ రాఘవ నాయక్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుండి నవంబర్ 8వ తేదీ వరకు ఈ ఖాదీ ఫెస్ట్ నిర్వహిస్తారని ఇందులో 30 ఖాది, పీఎంఈజీపి, ఆర్ఇజిపి యూనిట్లు, 6 హ్యాండ్లూమ్, 6 హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్ ద్వారా కోటి రూపాయల వ్యాపారం జరగాలని అంచనాతో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని 1917లో మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమం వేదికగా ఈ ఖాది ఉత్పత్తిని ప్రారంభించారన్నారు. ఆనాటి నుండి అనేక ఒడిదుడుకుల మధ్య ఖాదీ వినియోగం నేడు అత్యధికంగా పెరిగిందని, దేశీయ అమ్మకాల్లో పరిశీలిస్తే 334 శాతం కాదు అమ్మకాలు నమోదవుతున్నాయన్నారు. మొత్తం క్లాత్ వినియోగం అమ్మకాల్లో 20 శాతం ఖాదీ ఉందన్నారు. ఖాదీ అమ్మకాలు విస్తృతంలో భాగంగా కొత్త ఇన్స్ టిట్యూట్ లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖాదీ ఉత్పత్తులను ప్రజలు వినియోగించి ఆరోగ్యంగా ఉండా లని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డు కమిషనర్ కోటిరెడ్డి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఉమ్మడి చిత్తూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామ్, డిప్యూటీ డైరెక్టర్ రమేష్ బాబు, ఆర్ఎల్ఎన్ మూర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

లీలావతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట కు చెందిన టిడిపి నాయకులు మురళి రెడ్డి సోదరుడి భార్య లీలావతి అనా రోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ వడమాల పేట మండలంలో వున్న లీలావతి భౌతిక కాయంను సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

ఆర్టీసి డిపో ఎదుట ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన వారిని తక్షణమే శిక్షించాలని గూడూరు ఆర్టీసీ డిపో జేఏసీ (ఈయు, ఎస్‌డబ్ల్యుఎఫ్.) ఆధ్వర్యం లో ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట చేపట్టిన ఈ నిరసనలో ఆర్టిసి కార్మికు లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహ ణలో ఉన్న డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేయడం సిగ్గుచేటని దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు నారాయణ, ఈయు అధ్యక్షులు సుబ్బారావు, ఈ. యు కార్యదర్శి. శ్రీనివాసులు, ఈ. యు వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం రాజు, కడప జోన్ చీఫ్ వైస్ ప్రసిడెంట్ ఈవి కుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు రాము, డిపో గ్యారేజ్ కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

కావలిలో డ్రైవర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎన్ఎంయు ఉమ్మడి జోనల్ చైర్మన్ జి.ఎస్ వాసు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ,శిక్షించాలని డిమాండ్ చేస్తూ గూడూరు డిపోలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం డిపో సెక్రటరి ప్రవీణ్, ప్రసిడెంట్ ఎస్ కె బాష, గౌస్ సుధాకర్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : కావలిలో జరిగిన ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ పై దాడి చేసిన వైసిపి చర్యలు తీసుకోవాలని చిత్తూరు పార్లమెంటు టిఎన్‌టియుసి అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు. ఖండిస్తూ. నిరసన చేపట్టారు. సందర్భం గా ఆయన ఈ దుశ్చర్యకు పాల్ప డిన వైసిపి గుండాలను వెంటనే

మాట్లాడుతున్న టిఎన్‌టియుసి నాయకులు

అరెస్టు చేయాలని కోరుతూ వైసీపీ పాలన లో ఏ కార్మికుడికీ భద్రత లేదని, రోడ్డుకు అడ్డంగా నిలిపిన వైసీపీ గుండాల కారుని పక్కకు పొమ్మని ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ హారన్ కొట్టడంతో కారులోని గూండాలు, స్థానిక వైసిపి నాయకులు అందరూ కలిసి డ్రైవరును చాలా దారుణంగా కొట్టారని, అందుకు కారకులైన వైసీపీ గూండాలను వెంటనే అరెస్టు చేసి కార్మికులకు భద్రత కల్పించాలని సైకో ప్రభుత్వాన్ని కోరుతు న్నామన్నారు. ఈ దాడి వలన డ్రైవర్ రామ్ సింగ్ ప్రాణాపాయ స్థితిలో విద్యాధరపురం ఆర్టీసీ హాస్పిటల్‌లో వైద్య సౌకర్యం కల్పించాలని, అతనికి నష్టపరిహారంగా కోటి రూపాయలు అతని కుటుంబానికి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు బాలకృష్ణయ్య, దొరస్వామి పాల్గొన్నారు.

పుత్తూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

కావలి లో ఆటోనగర్ డిపో డ్రైవర్ రాంసింగ్ వారిపై దాడి చేసిన వైసీపీ నాయకులను. చర్య తీసుకోవాలని పుత్తూరు ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట కార్మికులు కలసి నల్ల బ్యాడ్జి ధరించి ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రతాప్ మాట్లాడుతూ కావలి లో ఆటోనగర్ డిపో డ్రైవర్ రాంసింగ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ కార్మికులపై దాడి చాలా దారుణమని ఇలా జరిగితే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో భారీ సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు, డిపోగ్యారేజ్ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆటోరంగ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సొంతకాళ్లపై నిలబడి బతుకుతున్న ఆటోరంగ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆటో నగర్ యూనియన్ అధ్యక్షుడు గోపి నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో స్థానిక

మాట్లాడుతున్న ఆటోనగర్ యూనియన్ అధ్యక్షులు గోపి నాయుడు

ఆటోనగర్ యూనియన్ కార్యాలయంలో ఆటో కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి నాయుడు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా సుమారు 500 కుటుంబాలు ఆటో మెకానిక్ కార్మికులుగా జీవనం సాగిస్తున్నాయని, ఏ ఒక్క కుటుం బానికీ సొంతిళ్లు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా పాలకులు మారు తున్నా సొంతింటి కల నెరవేరుస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం పెట్టడం లేదని వాపోయారు. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు తమవని, రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా తమను వాడుకుంటుండటం బాధాకరమన్నారు.

స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మాధుసూదన్ రెడ్డి దృష్టికి ఆటో రంగ కార్మికుల సమస్యలను తీసుకెళ్లామని, ఆయన పెద్ద మనసుతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మోహన్, ముని గోపాల్, సాదిక్ బేగ్, సుబ్రమణ్యం, తిరుపాల్ రెడ్డి, గోపాల్, మీర్జాన్ బేగ్ చిరంజీవులు, చెంగల్ రాయలు, మునికృష్ణ, గోపి, మని నాయుడు, మహేష్ పాల్గొన్నారు.

జనసేన భారీ ర్యాలీ

భారీ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల అనంతరం శ్రీకాళహస్తి గడ్డ జనసేన అడ్డాగా మారబోతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా అన్నారు. ఇంటింటికీ జనసేనలో భాగంగా స్థానిక ఏపీసీడ్స్ సర్కిల్ నుంచి వేలాది గా తరలి వచ్చిన జనసైనికులు, నాయకులు, వీర మహిళలతో కలిసి ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ నీడ్స్ పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఈ రాష్ట్రానికి పవన్ కల్యాణ్ నాయకత్వం అవశ్యకతను తెలియజేస్తూ, వైసీపీ చేస్తున్న అరాచకాలను ఎండగడతామని వినుత స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జనసేన–టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందనీ, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ర్యాలీ అనంతరం నియోజకవర్గ ముఖ్య నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతంకు దిశ నిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి వేల సంఖ్యలో నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు పత్రాలు అందజేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ శాఖ సహకారంతో 10 ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు చిన్న గుడుల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంజూరైన నిధుల పత్రాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం అందించారు. ఒక్కొక్క గుడికి రూ 10 లక్షలు చొప్పున మొత్తం 32 గుడులకు రూ.3.20 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలి

- సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే ఆర్టీసీ డ్రైవర్ పై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేరవేసే ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి దిగితే సహించేది లేదని కావలిలో రాజాసింగ్ పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రాజాసింగ్‌పై జరిగిన

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జోగి శివకుమార్

దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చి డ్రైవర్లకు భరోసా కల్పించాలని కోరారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వమే బాధ్యత వహించా లన్నారు. రాజాసింగ్ పై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించి రాజా సింగ్ కు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ లేక పోతే సామాన్యుల పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపి, పెంచల్ ప్రసాద్, చంద్రయ్య, బాలరాజు, త్రివేంద్ర , కెవిపిఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ లెక్చరర్‌కు ప్రభుత్వ ప్రశంస

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన ఎ.నందగోపాల్, నాగరాణి దంపతుల కుమారుడు సీనియర్ లెక్చరర్ ఎన్ సుభాష్ చంద్రబోస్ చంద్రగిరి పాలిటెక్నిక్ కాలేజ్ లో హెడ్ ఆఫ్‌ద డిపార్ట్మెంట్ గా పనిచేస్తున్నారు. పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం పాఠ్య పుస్తకం రచయితగా సుభాష్ ను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. విజయవాడలో జరిగిన సన్మాన కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ ద్వారా ఫస్ట్ ఇయర్ టెక్స్ట్ బుక్స్ అండ్ లేబరేటరీ మాన్యువల్స్ సర్టిఫికెట్ ను అందుకొన్నారు. ఈ శుభ సందర్భంగా సుభాష్ సోదరి కీలపూడి సచివాలయ మహిళా పోలీస్ ఎం లక్ష్మీ విజయ్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న లెక్చరర్ సుభాష్‌చంద్రబోస్

క్రీడలతో మానసికోల్లాసం: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు మండల పరిధిలోని నెర్నూరు గ్రామంలో దసరా పండుగ సందర్భంగా నెర్నూరు యువత అధ్వర్యంలో యంగ్ స్టార్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ క్రికెట్ లీగ్ లో మొత్తం 16టీమ్ లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ నెర్నూరు – తిమ్మ సముద్రం జట్టుల మధ్య జరిగింది. విజేత గా నెర్నూరు జట్టు, రన్నర్ గా తిమ్మ సముద్రం జట్టు నిలిచాయి. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహుకులను అభినందించారు. అనంతరం విజేతలకు ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు మీరయ్య, బలరామయ్య, క్రిష్టయ్య, శీనయ్య పాల్గొన్నారు.

లోకేష్ ను కలిసిన పోతుగుంట రాజేష్ నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను హైదరాబాదులో శ్రీకాళహస్తీశ్వర ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు పోతుగుంట గురవయ్య నాయుడు కుమారుడు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నారా లోకేష్ కు పుష్పగుచ్ఛం అందచేసి క్షేమ సమాచారాలు తెలుసు కున్నారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో రిమాండు ఖైదీగా ఉన్న నారా చంద్రబాబునాయుడు ఆరోగ్య పరిస్థితిని గురించి పోతుగుంట రాజేష్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఇక శ్రీకాళహస్తిలో టిడిపి విజయానికి కృషి చేయాలని పోతుగుంట రాజేష్ నాయుడుకు నారా లోకేష్ సూచించారు. ఇందుకు పోతుగుంట రాజేష్ అంగీకరించారు. శ్రీకాళహస్తిలో టీడీపీ–జనసేన పార్టీ ఉమ్మడి జెండా ఎగుర వేయడానికి తనవంతు కృషి చేస్తానని రాజేష్ హామీ ఇచ్చారు.

శ్మశానం దారి కోసం ధర్నా

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామ ప్రజలు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని ఆదివారం ధర్నా నిర్వహించారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నందువల్ల సీతారాంపేట గ్రామం పక్కనే ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతోందని, అయితే గ్రామంలో ఎవరైనా చనిపోతే ఫ్లై ఓవర్ నిర్మిస్తున్న దారి నుండే శ్మశానానికి ఎన్నో ఏళ్ల క్రితం నుండి తీసుకు వెళు తున్నారని అయితే ఇప్పుడు ఫ్లై ఓవర్ నిర్మించడంతో శ్మశానానికి వెళ్లి దారి లేకపోవడం వల్ల అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్ శ్మశాన దారి కోసం ధర్నా నిర్వహించారు. ఈ సమస్యను వెంటనే అధికారులు గుర్తించి పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి -వెంకటగిరి: 'బాబుకు బెయిలు జగనుకు జైలు, నిజం గెలవాలి' అంటూ ఆదివారం త్రిభుజ సెంటర్ లో టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగోడి నాగేశ్వరావు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమోహన్ రెడ్డి, సుధాకర్, నరసింహులు, బాబు, చలపతి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లో జగనాసురుడి పాలనను అంతమొందిద్దామని పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ముమ్మడి ఉషారాణి ఆధ్వర్యంలో కళ్యాణపురంలో "జగనన్న కళ్ల తెరిపిద్దాం"ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకుని 'జగన్ కళ్ల తెరిపించాలి.. నిజం గెలవాలి..' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీఎన్టీయూసీ అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు, పుత్తూరు రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, టీడీపీ నాయకులు క్రిష్ణకుమార్, సుబ్రమణ్యం నాయుడు, కన్నన్, గోపీనాథ్, శంకరాచారి, రాము, లక్ష్మీ, పెంచలయ్య, గౌస్, వేలు, భాను, వినీత్, హేవంత్, శీనా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్న సీఎం జగన్ కు కళ్ల తెరిపించాలంటూ మాజీ ఎమ్మెల్యే కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం నిరసన తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు వేసిన సంకెళ్లు బద్దలవ్వాలని జగనాసురునికి ఇప్పటికైన కనువిప్పు కలగాలంటూ నినాదాలు చేశారు. 'నిజం గెలవాలి.. నిజమే గెలవాలి' అంటూ ఆకాంక్షించారు. ఎస్వీవి దిలీప్ నాయుడు, గురు దశరథన్, నారాయణ యాదవ్ మోహన్ కిషోర్ నాయుడు, భాస్కర్ నాయుడు, సుదర్శన్ నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుది అక్రమ అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి - తిరుచానూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ చంద్రగిరి నియోజవర్గం, తిరుచానూరు నందు చంద్రగిరి నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆదేశాల మేరకు టిడిపి, జనసేన నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. తిరుపతి రూరల్ జనసేన అధ్యక్షులు వెంకట్ రాయల్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును ఖండించారు. వచ్చే ఎలక్షన్లో జనాలకి మంచి చేసే ఉమ్మడి ప్రభుత్వాన్ని టిడిపి, జనసేన స్థాపిస్తుందని ఆకాంక్షించారు.

క్యాంపస్ : ఎంఆర్ పల్లి కూడలి గాంధీ విగ్రహం వద్ద టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో "నిజం గెలవాలి" అని నినాదాలతో జగనాసురా చీకటి పాలనకు నిరసనగా కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ 19,20,22 డివిజన్ అధ్యక్షులు కార్యదర్శులు కొండారెడ్డి, రామచంద్ర రెడ్డి,మధు, నాగేంద్ర,దాము ఆచారి,వినోద్, గంగులయ్య, డేనియల్, సాయి,బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా కృషి బాడ్మింటన్ అకాడమీ వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం కొత్త కాల్వలో కృషి బాడ్మింటన్ అకాడమీలో మొదటి వార్షికో త్సవ సందర్భంగా గురునాథ హార్డ్వేర్, జై డోర్స్ సహ కారంతో గొప్ప ఓపెన్ టు ఆల్ టోర్నమెంట్ నిర్వహిం చారు. ఈ టోర్నమెంట్ కి పలు ప్రాంతాల నుంచి క్రీడా కారులు పాల్గొన్నారు. వారిలో మొదటి బహుమతి గా శశిభూషణ్ రావు, పి శరత్ కుమార్,(తిరుపతి) వారు గెలు పొందారు. రనర్స్ గా చక్రధర్ రెడ్డి, ఎస్ మహమ్మద్ వసీం గెలుపొందారు. విన్నర్స్ అండ్ రన్నర్స్ కి జై డోర్స్ అధినేత చాపల జయశంకర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,రూపస్, లోకేష్, కేశవులు, చాను, కిరణ్, కుడితి శేఖర్, మధు, తులసి, క్రీడాకారుల పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV th ADDL. DISTRICT JUDGE : TIRUPATI
O.S. NO. 103 / 2022

K. Yuvaraju Reddy, S/o K. Govinda Reddy .....Plaintiff

Vs

S.M Farhana, W/o S.M. Farook and others ....Defendants

SUMMONS TO THE DEFT DEFENDANT NO.3

K. Indrasena Reddy, S/o K. R. Krishna Reddy, D.No. 5-211, 3rd Cross, Pakala Bharadham Mitta, Pakala Post and Mandal, Chittoor District.

Where as the palintiff filed a suit against you and others and case is posted to 22-11-2023 for your appearance. You shall appear on 22-11-2023 at 10.30 A.M either in person or by advocate if you filed to do so the case will be decided in your absence.

G. Raja Reddy, B.Com., LL.B., K. Subramanyam Raju, B.Com., LL.B., B.K. Ramesh, B.Com., LL.B., Advocates for plaintiff.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM XII ADDITIONAL DISTRICT JUDGE : SRIKALAHASTI
M.V.O.P.NO. 87 OF 2023,

S.Venkatesh ....Petitioner

Vs

1. Kanumuru Srinivasulu, (Driver)
2. Mis. Vasantha Lakshmi, (Owner),
3. Royal Sundaram General Insurance Co. Ltd., Rep by its Divisional Manager, Nellore. ....Respondents

NOTICE TO REPONDENT .2

Mis. Vasantha Lakshmi, W/o Kavassery Ramakrishna, Hindu, aged not known to the Petitioner, but major Owner of the Car bearing No. AP 39, DH 5194, residing at Door No.9-96-2, Brahmin Street, Sulurpeta Town and Mandal, Nellore District.

Sir,

Please take notice that the Accident O.P. was filed by the petitioner for Rs.2,00,000/- and the same has been posted on 20-11-2023 for your appearance. Please attend on that day before the above said court by 10.30a.m, and file you objections if any. Otherwise the matter will be decided exparte.

Hearing date : 20-11-2023

V. SUDHAKAR, Advocate for the Petitioner, Tirupati, Cell No. 9393605963.

IN THE COURT OF THE IV th ADDL. DISTRICT JUDGE : TIRUPATI
O.S. NO. 103 / 2022

K. Yuvaraju Reddy, S/o K. Govinda Reddy .....Plaintiff

Vs

S.M Farhana, W/o S.M. Farook and others ....Defendants

SUMMONS TO THE DEFT DEFENDANT NO.3

K. Indrasena Reddy, S/o K. R. Krishna Reddy, D.No. 5-211, 3rd Cross, Pakala Bharadham Mitta, Pakala Post and Mandal, Chittoor District.

Where as the palintiff filed a suit against you and others and case is posted to 22-11-2023 for your appearance. You shall appear on 22-11-2023 at 10.30 A.M either in person or by advocate if you filed to do so the case will be decided in your absence.

G. Raja Reddy, B.Com., LL.B., K. Subramanyam Raju, B.Com., LL.B., B.K. Ramesh, B.Com., LL.B., Advocates for plaintiff.

బహుమతి ప్రదానోత్సవం

వేగుచుక్క 'వేమన'

- విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం
- 'పద్యానికి పట్టాభిషేక' ర్యాలీ
- 'సమతా స్వాప్నికుడు' పుస్తకావిష్కరణ
- విద్యార్థులకు బహుమతులు ప్రదానం
- అలరించిన నృత్యరూపకం

ప్రజాశక్తి - తిరుపతి

'ఒక సూర్యబింబం... ఒక దీపస్తంభం.. ఒక జ్ఞానసంద్రం..ఒక ధైర్యశిఖరం ...వేమన్న పద్యం...వేనోళ్ల వాదం..' అంటూ వేగుచుక్క.. వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతి నగర నడిబొడ్డున యశోదానగర్‌లో వందలాది మేధావులు, కవులు, రచయితలు, విద్యార్థుల మధ్య ఉత్సాహపూరిత వాతావరణంలో, స్ఫూర్తిదాయకంగా ఆదివారం ప్రారంభమయ్యింది.. తొలుత టిటిడి పరిపాలనా భవనం నుంచి 'వేమన పద్యాలకు పట్టాభిషేకం' అంటూ పద్యాలాపన చేస్తూ వేమన విజ్ఞాన కేంద్రం వరకూ ర్యాలీ సాగింది. ప్రముఖ పాత్రికేయులు, విశ్లేషకులు తెలకపల్లి రవి, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. పలవలి రామకృష్ణారెడ్డి సమావేశ మందిరాన్ని ఆయన కుమార్తె పలవలి కుసుమకుమారి, ఎజి యతిరాజులు సమావేశ మందిరాన్ని ఆయన భార్య ఎజి చంద్రమ్మ ప్రారంభించారు. వేమన పద్య చిత్రలేఖన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన వేమన పద్య నృత్య రూపకం సభికులను ఆలోచింపజేసింది. సభకు బాలోత్సవ గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షత వహిస్తూ వేమన పద్యం ప్రాముఖ్యతను వివరించారు. వర్షానికి తడవనివారు, వేమన పద్యాలు ఒకట్రెండైనా రానివారు ఎవరూ ఉండరన్నారు.

స్వాగతం పలుకుతున్న కన్వీనర్ ఎం.నాగార్జున

వేమనకు నీరాజనం ప్రదర్శన ర్యాలీ

కాలానికంటే ముందు నడిచిన వ్యక్తి వేమన

: తెలకపల్లి, విఠపు

తెలకపల్లి రవి, విఠపు బాలసుబ్రమణ్యం సభను ఉద్దేశించి మాట్లాడుతూ వేమన అప్పట్లోనే కాలానికంటే ముందు నడిచిన వ్యక్తని, నేటికీ కాలంతో పాటు నడుస్తున్న వ్యక్తని కొనియాడారు. వేయి తలపులు సంఘర్షిస్తూ ప్రశ్నించేవారికి విజ్ఞాన కేంద్రమవ్వాలన్నారు. ఆంధ్రులంటే ఆరంభశూరులనే తేలిక భావం జనంలో ఉందని కానీ ఆనాడే వేమన 'పట్టుబట్టరాదు..పట్టి విడువరాదు.. పట్టినేని బిగియ పట్టవలయు.. పట్టి విడుచుటకన్నా పడి చచ్చుట మేలు' అని విచక్షణతో సరైన మార్గం ఎంచుకోవాలని సూచించారు. సమాజానికి హేతబద్ధ ప్రశ్నలను నేర్పించిన మహాకవి వేమన సూచించిన మార్గంలో భవిష్యత్ తరాలు నడవాలన్నారు. సమాజం పట్ల బాధ్యతతో ప్రశ్నించిన ఎవరికైనా ప్రజలంతా అండగా నిలవాలని, ఇటీవల అరెస్టయిన న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టు సందర్భంగా అలా జరగకపోవడం బాధాకరమని అన్నారు. ఆధునిక కవిత్రయం అంటే వేమన, గురజాడ, శ్రీశ్రీ అని ఉద్ఘాటించారు. వారి భాషలోనూ, భావాల్లోనూ విప్లవాత్మక సందేశం ఉందన్నారు. నాటికీ నేటికీ వేమన పద్యాలు కాలానుగుణంగా ప్రాచుర్యం పొందుతూనే ఉన్నాయన్నారు.



సమాజ గమన సూత్రాలు చెప్పారు

: ఆచార్య కుసుమ కుమారి

నేటి సమాజ గమన సూత్రాలను ఆనాడే తన పద్యాల రూపంలో తెలియజేసిన మహాకవి వేమన అని మాజీ వీసీ ఆచార్య కుసుమకుమారి అన్నారు. తన తండ్రి పేరుతో సమావేశ మందిరాన్ని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమను తమ తండ్రి పలవలి రామకృష్ణారెడ్డి భౌతికవాద దృక్పథంతోనే పెంచారని గుర్తు చేశారు. త్వరలోనే ప్రారంభించబోయే గ్రంథాలయానికి తనవంతు సాయంగా రూ.50వేలు ఇస్తున్నట్లు సభావేదికపైనే ప్రకటించారు.

రైతుగా ఉండటమే ఇష్టం

: డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్

తనకు డాక్టర్‌గా కంటే భూమిబిడ్డగా, రైతుగా ఉండటమే ఇష్టమని డాక్టర్ లింగుట్ల రమేష్‌నాథ్ అన్నారు. సమాజ సేవలో వేమన విజ్ఞాన కేంద్రం ఇప్పటికే చేస్తున్న కృషిని అభినందించారు. తనవంతు సాయం ఎపుడూ ఈ కేంద్రానికి ఉంటుందని చెప్పారు. ఈ కాలపు వికృత పోకడలను ఆనాడే గుర్తించి నిజాన్ని నిక్కచ్చిగా జనానికి వల్లెవేసిన వేమన ఆశయ సాధన కోసం తిరుపతివాసులంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి కేంద్రంగా ఈవిజ్ఞాన కేంద్రం ఉండాలన్నారు.

వేమన దివిటిని భవిష్యత్ తరాలకు

: కొలకలూరి మధుజ్యోతి

వేమన అందించిన స్ఫూర్తిదాయకమైన పద్యాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఓ యజ్ఞంలా విజ్ఞాన కేంద్రం పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి అన్నారు. సమాజంలోని రుగ్మతలపై వేగుచుక్కలా వేమన పద్యాల ప్రభావం ఎప్పటికీ ఉంటుందన్నారు. వేమనను విశ్వకవిగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు.

వేదికపై మాట్లాడుతున్న విఠపు

సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతున్న టెంకాయల దామోదరం

తిరుపతివాసుల్లో ఐక్యత ఉంది

: కెవి చౌదరి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు

తిరుపతి వాసుల్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అనాదిగా ఐక్యత ఉంది. వారందరి సహకారంతో బాలోత్సవం విజయవంతమయ్యింది. భవిష్యత్ తరాల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నింటికీ ఛాంబరాఫ్ కామర్స్ సహకారం ఎపుడూ ఉంటుంది.

వాస్తవాలకు విరుద్ధంగా సోషల్ మీడియా : ఎజి అరవింద్

వాస్తవాలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో మంచి కంటే చెడే ఎక్కువగా ప్రచారం జరుగుతోందని, కులం మతం, ప్రాంతీయ భావాలతో మనుష్యుల దూరం పెరుగుతోందని ప్రముఖ అనువాదకులు ఎజి యతిరాజులు కుమారుడు ఎజి అరవింద్ అన్నారు. ఈ రుగ్మతలు పోవాలంటే నేటి తరానికి వేమన సాహిత్యం అవసరమని అన్నారు. విజ్ఞాన కేంద్రంలో తన తండ్రి పేరుతో సభామందిరం ఏర్పాటు చేయడం మరచిపోలేని జ్ఞాపకంగా మిగులుతుందన్నారు.

కార్యక్రమంలో రాయలసీమ సాహితీవేత్త భూమన్, ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు, కస్తూరిబా గాంధీ ట్రస్టు అధ్యక్షులు పిసి రాయల్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రాయలసీమ మిమిక్రీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు విజయ్‌కుమార్, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, రీజినల్ సైన్స్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస నెహ్రూ, హంస అవార్డు గ్రహీత యండపల్లి భారతి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పల్లెపట్టు నాగరాజు, అభినవ వేమన పత్తిపాటి రమేష్‌నాయుడు, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు తమటం రామచంద్రారెడ్డి, శిల్ప కళాశాల కళాకారుడు డాక్టర్ సాగర్ గిన్నె, విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, సుంకర రెడ్డెప్ప, సాయిలక్ష్మి, అవనిగడ్డ పద్మజ, గురునాధం, పసల మునిరామయ్య ఉన్నారు.

వేమన విజ్ఞాన కేంద్రం ఈనాటి అవసరం

: ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

మన సమాజం శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్ప విజయాలు సాధిస్తున్నా, చాలా విషయాల్లో మధ్యయుగ అవశేషాల నుంచి బయటపడలేకపోతున్నది. వేమన వీరబ్రహ్మంలు సామాజిక రుగ్మతలను ఆనాడే విమర్శించారు. అవి యథాతథంగానే రూపం మార్చుకొని ఇంకా కొనసాగుతున్నది. నిజానికి అవి ఇప్పుడు కార్పొరేట్ రూపం తీసుకున్నాయి. వాటిని నిర్మూలించేందుకు ఇకపోతే మన సమాజం మానవీయ గుణాన్ని నిలుపుకోజాలదు. ఆధునిక సమాజం అనిపించుకోదు. అందుకే వేమన విజ్ఞాన కేంద్రం ఈనాటి అవసరం. ఈదృష్టితోనే విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని నమ్ముతున్నాను. అనారోగ్య కారణం వల్ల ప్రారంభోత్సవానికి రాలేకపోయినందుకు చాలా బాధగా ఉంది. ప్రారంభోత్సవంలో పాల్గొన్న తెలకపల్లి రవి, విఠపు బాలసుబ్రమణ్యం, ఆచార్య కుసుమ కుమారి ఇతర అతిథులకు 'సమతా షాప్నికుడు వేమన 'సంచిక రూపకల్పనలో భాగస్వాములైన సంపాదకవర్గం, వ్యాసకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

వేమన పద్య నృత్యరూపకం

పునర్ నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు

అంజూరు ఫైర్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధం దేవాలయమైన శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయము పునర్నిర్మాణ పనుల్లో జాప్యం తగదని ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పనుల్లో జాప్యాన్ని కారణమైన ఇంజనీరింగ్‌శాఖ అధికారులపై మండిపడ్డారు. ఆదివారం ఆయన యువసాగర్ బాబుతో కలిసి ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఇకపై ప్రతిరోజు యుద్ధ ప్రాతిపదికంగా పనులను నిర్వహించాలని ఆదేశించారు. 15 లేయర్లు నిర్మాణ పనులకు సంబంధించిన టెక్నికల్ అనుమతులు లభించాయి కాబట్టి ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఇక ఎలాంటి పరిస్థితుల్లోనూ జాప్యానికి తావు లేకుండా పనులను శరవేగంగా చేయాలని కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. ప్రస్తుతం ఐదవ లేయర్ పనులు పూర్తి అయ్యింది కాబట్టి మిగతా లేయర్లు పనులను విభజించుకుని పనులను వేగవంతం చెయ్యకపోతే రాబోయే రోజుల్లో కుంభాభిషేకం సమయానికి పూర్తి కాదని తెలిపారు. అధికారులకు కాంట్రాక్టుకు తెలియజేశారు. అదేవిధంగా 15 లేయర్లకు సంబంధించి రాతి బండలను స్కిట్ కాలేజ్ వద్ద చేరవేసి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అదేవిధంగా పునర్మాణ పనులను దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ అధికారులు పూర్తిగా ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ఇక్కడ ఉన్న పాత రాతిబండల రబ్బీస్ను యుద్ధ ప్రాతిపదికన తొలగించి లోబావిలో చేర్చాలని సూచించారు. శిల్పి కార్మికులను కూడా పెంచి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. తెలియజేశారు.

శివయ్య కొందరి వాడేనా?

కొందరికే గ్రహణ పూజలు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఎన్ని వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నా వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. తాము చెప్పిందే శాసనం, చేసింది కరెక్టు అనే విధంగా ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి ఆలయంలో చంద్ర గ్రహణం సందర్భంగా మూడుసార్లు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని ఈవో సాగర్ బాబు ముందుగా ప్రకటించారు. అయితే భక్తులను అనుమతిస్తారా లేదా అనే విషయాన్ని ఆయన తెలపలేదు. అయితే సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు అభిషేక సేవలో పాల్గొన్నట్లు సమాచారం. ధర్మకర్తల మండలికి చెందిన కొందరు సభ్యులు, దేవస్థానం అధికారులు కొందరు తమకు సంబంధించిన వారిని అభిషేకాలకు ఆహ్వానించినట్లు తెలిసింది. ప్రత్యేక అభిషేకాలకు భక్తులను అనుమతించేదీ, లేనిది దేవస్థానం అధికారులు ఎందుకు బహిరంగంగా ప్రకటించలేదో వారికే తెలియాలి. అధికారులు ముందుగా ప్రకటించి ఉంటే స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల భక్తులు కూడా అభిషేకాలకు వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఉండేవారు. శివయ్య అందరివాడు కాదు కొందరి వాడే అని అధికారులే నిర్ణయం తీసుకున్నట్లుగా ఉంది..!!

26 మంది టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు

ఏ1గా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు సీఐ అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు 26మంది తెలుగుదేశం పార్టీ నేతలపై శనివారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1గా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని చూపారు. ఇక ఏ2గా రంగినేని చెంచయ్య నాయుడు, ఏ3గా రావిళ్ల మునిరాజా నాయుడు, ఏ4గా కాసరం రమేష్, ఏ5గా చక్రాల ఉష, ఏ6గా సుబ్బయ్య, ఏ7గా కుమారి, ఏ8గా రాజేష్, ఏ9గా రవీంద్రరెడ్డి, ఏ10గా బషీర్ తో పాటు శ్రీనివాసులు, మిన్నల్ రవి, సన్నీ డియోల్, కోబాక లక్ష్మణ్, బాలాజీ రెడ్డి, కంఠా రమేష్, బాలాజీ, ఎఎంవాడ గోపి, వజ్రం కిషోర్, గోపి, చుక్కల రమేష్, జనసేననేత కొట్టే సాయి, బాబు నాయుడు, చెంచయ్య నాయుడు, శ్రీనివాసులు నాయుడు, క్రిష్ణమ నాయుడుపై ఈ కేసు నమోదు చేశారు. కొసమెరుపు ఏమిటంటే ఇందులో కొంతమంది ఎస్సీ, ఎస్టీ నేతలపై కూడా అట్రాసిటీ కేసు పెట్టడం. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు ఇటీవల జగనాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో కూడా ఈ నిరసన కార్యక్రమం చేశారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కమ్మకొత్తూరుకు వెళ్లి నిరసన తెలిపిన గ్రామీణులపై కేసులు పెడతామంటూ బెదిరించారు. ఇదే గ్రామంలో చెంచయ్య నాయుడు అనే వృద్ధుని పోలీసులు చితక బాదారు. ఇలా చేయడంతో ఆయన పోలీసులను నిలదీశారు. తనపై పోలీసులు దాడి చేసిన విషయాన్ని చెంచయ్య నాయుడు తెలుగదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఐ అజయ్ కుమార్‌కు ఫోన్ చేశారు. చెంచయ్య నాయుడును ఎందుకు కొట్టారని ప్రశ్నించారు. ఇందుకు ఆగ్రహించిన సీఐ అజయ్ కుమార్ టీడీపీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని పరుష పదజాలంతో దూషించారు. దీంతో బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి టీడీపీ శ్రేణులతో కలసి శనివారం శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. సీఐ అజయ్ కుమార్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా నేపథ్యంలో తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి జోక్యం చేసుకున్నారు. సీఐ అజయ్ కుమార్ తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ హామీతో టీడీపీ శ్రేణులు ధర్నా విరమించారు. అయితే పోలీసులు సీఐ అజయ్ కుమార్ పై చర్యలు తీసుకోకుండా నిరసన తెలిపిన టీడీపీ శ్రేణులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విధులకు ఆటంకం కలిగించారని తదితర సెక్షన్ల కింద శ్రీకాళహస్తి రెండవ పోలీసు స్టేషన్ సీఐ మల్లిఖార్జున కేసు నమోదు చేశారు. ఒకేసారి 26 మంది టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. అన్యాయంగా కమ్మకొత్తూరు వాసులను చితకబాదిన సీఐ అజయ్ కుమార్ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి... న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై అట్రాసిటీ కేసు పెట్టడం ఎంతవరకు న్యాయమని టీడీపీ శ్రేణులు వాపోతున్నాయి.

ఎల్‌నినో/లా నినాల ప్రభావంతోనే వాతావరణంలో మార్పులు

ఎస్వియూ భౌతిక శాస్త్ర ఆచార్యులు ఎస్.విజయభాస్కరరావు

కొన్ని ప్రాంతాల్లో అతివష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావష్టి ఏర్పడే అవకాశం

ప్రజాశక్తి - క్యాంపస్:

తూర్పు పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలలో మార్పుల ఏర్పడే ఎల్ నినో/ లా నినా ప్రక్రియల మూలంగా ప్రపంచ వాతావరణంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని, దీని కారణంగా ఆంధ్రప్రదేశ్ సహా భారత ఉపఖండంలో వాతావరణం కూడా వాతావరణం మార్పులకు ఎంతో అవకాశం ఉందని ప్రముఖ భౌతిక శాస్త్ర ఆచార్యులు ఎస్.విజయ భాస్కరరావు పేర్కొన్నారు. వాతావరణం మార్పులు – కారణాలు అనే అంశంపై 'ప్రజాశక్తి 'తో ఆయన మాట్లాడుతూ ఎల్ నినో/లా నినా సదరన్ ఆసిలేషన్ (ఎంసో) ప్రక్రియ, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తుందన్నారు. సహజసిద్ధంగా జరిగే ఈ ప్రక్రియలో పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రత (ఎస్ఎస్‌టి)లలో మార్పులు జరగడం ద్వారా ఏర్పడే వాతావరణ పీడనం, ప్రసరణ మార్పులు, ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేస్తుందని వివరించారు. ఎంసో ప్రక్రియని అర్థం చేసుకోవడంలో, అంచనా వేయడంలో ఇటీవల కాలం శాస్త్రవేత్తలు పురోగతి సాధించారని తెలిపారు. ఎంసో ప్రక్రియ అర్థం చేసుకోవటం ద్వారా భారీ వర్షాలు, వరదలు మరియు కరువు, కాటకాలు వంటి సంఘటనలను ఒకటి నుంచి తొమ్మిది నెలలు ముందుగానే గ్రహించి, వాటి పరిణామాల గురించి ముందుగానే హెచ్చరించే అవకాశం ఉందని వివరించారు. 2020 నుంచి 2023 వరకు సంభవించిన 'ట్రిపుల్– డిప్ లా నినా' సంఘటనలను పరిగణలోకి తీసుకొని ఈ లా నినా పసిఫిక్ మహాసముద్రంలో నిరంతరం బలమైన గాలులను కలిగి ఉండడాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత, గాలి క్రమరాహిత్యాల నిర్దిష్ట నమూనాల కారణంగా ఇటువంటి పరిణామాలు జరిగినట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారని వెల్లడించారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత, గాలుల తీవ్రత ఆధారంగా ఈ అసాధారణ నమూనాలను ట్రిపుల్– డిప్ లా నినా ప్రక్రియకు అనుకూలమైన వాతావరణాన్ని సష్టించాయని వివరించారు. 'నినో 3.4 ఇండెక్స్' పరిజ్ఞానంతో పసిఫిక్ మహాసముద్రంలోని నిర్దిష్ట భాగంలో ఉష్ణోగ్రతను కొలవడం సులభంగా మారిందని అన్నారు. ట్రిపుల్ డిప్ లా నినా ప్రక్రియ సమయంలో ఇది సాధారణం కంటే స్థిరంగా చల్లగా ఉంది. ఇది ఈ లా నినా సుదీర్ఘ స్వభావాన్ని సూచిస్తుందని తెలిపారు. మల్టీ ఇయర్ లా నినా, ఈ ట్రిపుల్– డిప్ ఈవెంట్ లాగా, తక్కువ, ఒకే సంవత్సరం లా నినా ప్రక్రియ తో పోలిస్తే ప్రపంచ వాతావరణ ప్రసరణపై మరింత ముఖ్యమైన శాశ్వతమైన ప్రభావాలను విశ్లేషించేందుకు ఈ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అసాధారణ వాతావరణ పరిస్థితులకు ఏర్పడడంతో కొన్ని ప్రాంతాల్లో వర్షప్రభవ పరిస్థితులు, మరికొన్నింటిలో వర్షాచ్ఛాయ పరిస్థితులు ఉన్నాయని విశ్లేషించారు. 2022లో ఈ సుదీర్ఘ లానినా వాతావరణ నమూనాలను ప్రభావితం చేయడం వలన దక్షిణ చైనాలో కరువు, పాకిస్తాన్లో భారీ వర్షాలు కురవడం వంటి పరస్పర విరుద్ధ వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఇటువంటి వాతావరణ నమూనాలను, ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను క్షుణంగా అధ్యయనం చేయడానికి లానినా ప్రభావం శాస్త్రవేత్తలకు ఉపయోగపడుతుందని అన్నారు. సెప్టెంబర్ 2023లో భూమధ్య రేఖ పసిఫిక్‌లోని సముద్రం సాధారణం కంటే వెచ్చగా ఉంది, ముఖ్యంగా నినో 3.4 ప్రాంతంలో అక్టోబర్‌లో మొదటి 16 రోజులు, సెంట్రల్ ఈక్వటోరియల్ పసిఫిక్ ఉపరితల ఉష్ణోగ్రత మరింత వేడెక్కి ధని, అయితే పశ్చిమ,తూర్పు భాగాలు చల్లబడ్డాయని వివరించారు. సెప్టెంబర్‌లో అరేబియా సముద్రం, పశ్చిమ భూమధ్య రేఖ హిందూ మహాసముద్రంలో వెచ్చని ఉపరితల ఉష్ణోగ్రతలు వునాకానీ, ఉత్తర బంగాళాఖాతం, దక్షిణ భూమధ్యరేఖ హిందూ మహాసముద్రంలో చల్లటి ఉష్ణోగ్రతలు వునాయని అన్నారు. అక్టోబర్‌లో ఉత్తర అరేబియా సముద్రం వేడెక్కింది, అయితే ఉత్తర బంగాళాఖాతం, భూమధ్య రేఖ భారతదేశంలో చాలా వరకు వేడెక్కిందని, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత చల్లబడిందన్నారు. మధ్య మరియు తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే మూడునెలల పాటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ అంచనా వ్యవస్థ సూచిస్తుందని వెల్లడించారు. ఇది ఎల్ నినో పరిస్థితులు 2024 ప్రారంభంలో కొనసాగడానికి దారి తీయవచ్చన్నారు. సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువ (10డి) ఉపరితల ఉష్ణోగ్రత పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇది వెచ్చని ఎల్ నినో సానుకూల ఐఒడి పరిస్థితుల కారణంగా భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వర్షాలు కురుస్తుందని, మరి కొన్ని ప్రాంతాలలో కరువు కాటకాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీని వలన బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో మరిన్ని తుపానులు వచ్చే అవకాశం ఉందన్నారు. సెప్టెంబరు నుంచి నవంబర్ 2023 వరకు తీవ్ర వాయువ్య, ఈశాన్య, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సగటు కంటే ఎక్కువ వర్షం కురిసే సంభావ్యత ఎక్కువగా ఉంటుందని వివరించారు. కానీ ఉత్తరం, పశ్చిమం, మధ్య తూర్పు, ఉత్తర ద్వీపకల్ప ప్రాంతాలలో సగటు కంటే తక్కువ వర్షం కురిసే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. అక్టోబరు నుంచి డిసెంబర్ 2023 వరకు ఉత్తర ద్వీపకల్ప ప్రాంతాలు, మధ్య దక్షిణ ఆసియాలోని కొన్ని ప్రాంతాలు మినహా, దక్షిణాసియాలో చాలా వరకు వర్షాలు కురుస్తాయని, దేశంలో తక్కువ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వాలు తగ్గిన సహాయక చర్యలు చేపట్టేందుకు వాతావరణశాఖ సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గమనిస్తూ వారి యొక్క సూచనలు సలహాలు పాటించాలని సూచించారు. వాతావరణంలో మార్పులు ఒక్కరోజులో మొదలైన ప్రక్రియ కాదని ఎల్ నినో / లా నినా ప్రభావాల వలన ప్రపంచవ్యాప్తంగా కూడా అతివష్టి లేదా అనావష్టి పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. సముద్ర అంతర్భాగంలో ఏర్పడి ఈ చర్యలకు కొన్ని వాతావరణ కాలుష్య పరిస్థితులు కూడా ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. సముద్రతీర ప్రాంతాలలోని ఆయా ప్రభుత్వాలు దానికి అనుగుణంగా వాతావరణ సూచనలను పరిగణలోకి తీసుకొని తక్షణం స్పందించి తగు నివారణ చర్యలను తీసుకోవాలని సూచించారు.